సాక్షి తిరుపతి

మంగళవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2023



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.58,330
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,215
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.68,000
రిటైల్ వెండి గ్రాము రూ.70.00

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	18
చిత్తూరు	35	18
తిరుమల	31	14
గూడూరు	34	19
నగరి	34	18



నంది వాహనంపై చిద్విలాసం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు నంది హనంపై, అమ్మవారు కామధేనువుపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.

న్యూస్‌రీల్

విమానాశ్రయ భూసేకరణ పూర్తిచేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: రేణిగుంట విమానాశ్రయ విస్తరణకు సంబంధించి భూసేకరణ పూర్తిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, విమానాశ్రయ అధికారులతో ఆయన సమీక్షించారు. విమానాశ్రయానికి చెందిన భూసేకరణ, వాటి నష్టపరిహారం చెల్లింపు, వివిధ దశల్లో కోర్టులో ఉన్న అంశాలపై సకాలంలో కౌంటర్ ఫైల్ చేయాలని చెప్పారు. విమానాశ్రయానికి 3.4 ఎకరాల భూసేకరణ పూర్తిచేయాల్సి ఉందని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావును ఆదేశించారు. అలాగే హైమాస్ట్ ట్రాన్స్‌మిషన్ టవర్స్‌ను తొలగించాలన్నారు. విమానాశ్రయం అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, నేషనల్ హైవే పీడీ హరికృష్ణ, ఏర్పేడు, రేణిగుంట తహసీల్దార్లు ఉదయ్ సంతోష్, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగు గంటల పాటు కూలీలు పనిచేయాలి



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

దక్కిలి: జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలు రోజూ నాలుగు గంటలకు తగ్గకుండా పనిచేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. మండలంలోని సంగనపల్లి పంచాయతీ యల్లావజ్జలపల్లి (బ్రాహ్మణపల్లి)లో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం కూలీలో మాట్లాడారు. మండలంలో రోజుకి 1,800 మంది కూలీలు పనిచేస్తున్నారని, ఇక మీదట ఈ సంఖ్య 2,200 మందికి తగ్గకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పనులకు వచ్చే కూలీలకు మార్కింగ్ ఇచ్చి రోజూ రూ.257 కూలీ తగ్గకుండా చేయించాలని చెప్పారు. ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ దామోదరరాజు, టెక్నికల్ అసిస్టెంట్ షఫీ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

తిరుపతి అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని డీఆర్వో ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రోడ్లు.. భద్రతా విషయాలపై సమావేశం నిర్వహించారు. ఎంఆర్‌పల్లి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిల్లకూరు, గూడూరు ప్రాంతాల్లో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయని, వాటి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బాధితులను ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడిన(గోల్డెన్ అవర్) వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల ప్రోత్సాహక బహుమతి అందజేస్తోందని గుర్తుచేశారు. టోల్ గేట్ వద్ద డ్రైవర్లు సేద తీరడానికి 5 ఎకరాల భూములను గుర్తించాలని ఆర్డీఓలను ఆదేశించారు. తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు కనకనరసారెడ్డి, రామారావు, ట్రాఫిక్ డీఎస్పీ కాటమరాజు, జాతీయ రహదారుల పీడీ హరికృష్ణ, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్‌రెడ్డి, రవాణాశాఖ ఎంవీఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

స్పందనకు 60 ఫిర్యాదులు



ఫిర్యాదును స్వీకరిస్తున్న ఏఎస్పీ కులశేఖర్

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 60 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై అధిక మొత్తంలో ఫిర్యాదులు వచ్చినట్టు వారు పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వాహణపై అప్రమత్తం

తిరుపతి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా మెలగాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రధానంగా తహసీల్దార్లు ఎన్నికల నియమావళిని పాటించాలని చెప్పారు. సోమవారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్‌మీనా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జేసీలు, డీఆర్వోలతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు ఇచ్చారు.

పెళ్లి సందడి

శ్రీకాళహస్తిలో పెళ్లి కళ ఉట్టిపడింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శివ, పార్వతుల కల్యాణానికి అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది. కల్యాణ వేదికను అరటి పిలకలు, మామిడి తోరణాలు.. విద్యుత్ కాంతులు.. ముత్యాల ముగ్గులతో చూడముచ్చటగా తీర్చిదిద్దింది. శివయ్య పెళ్లికొడుకు అలంకరణ భక్తులను పరవశింపజేసింది. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు పెళ్లికూతురు అలంకరణ ఆధ్యాత్మికచింతనలో ముంచెత్తింది. అర్ధరాత్రి దాటాక స్వామి, అమ్మవార్లు గజ, సింహ వాహనాలపై పెళ్లి మండపానికి వేంచేయగా.. అర్చక పండితులు కల్యాణ క్రతువును ప్రారంభించారు. దేవుడి పెళ్లి సందర్భంగా బ్రహ్మఘడియల్లో సుముహూర్తాన ఒక్కటయ్యేందుకు పెద్ద సంఖ్యలో నూతన వధూవరులు తరలివచ్చారు.

- శ్రీకాళహస్తిలో ఉట్టిపడిన పెళ్లి కళ
- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆది దంపతుల కల్యాణం
- దేవుడి పెళ్లికి సర్వాంగ సుందరంగా ముస్తాబు
- ఒక్కటయ్యేందుకు తరలివచ్చిన జంటలు



పెళ్లికొడుకు అలంకరణలో శివయ్య



పెళ్లి కూతురుగా ముస్తాబైన పార్వతీదేవి

శ్రీకాళహస్తి/తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మో త్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం శివపార్వతుల కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

విశేష అలంకరణ

నుదుట తిలకం దిద్ది.. బుగ్గన చుక్కను పెట్టి.. ఉత్సవర్లను నూతన వధూవరులుగా ముస్తాబు చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



ముస్తాబైన కల్యాణ వేదిక

గజరాజుపై స్వామి, సింహ వాహనంపై అమ్మవారు

స్వామి అమ్మవార్లను భిక్షాల గాలిగోపురం వద్ద గజ, సింహనాలపై అధిష్ఠింపజేసి పెళ్లిమండపానికి తీసుకువచ్చారు. వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, చండికేశ్వరుడు, కన్నప్ప ముందు కదలగా శివపార్వతులు నూతన వధూవరుల అలంకరణలో ఊరేగింపుగా తరలివచ్చారు.

ఆసక్తిగా చండికేశ్వరుని రాయబారం

మార్గ మధ్యంలో సింహ వాహనంపై ఊరేగింపుగా వెళ్తున్న అమ్మవారు నెహ్రూ వీధిలోనే ఆగిపోయారు. ఈ సందర్భంగా పరమేశ్వరుని భక్తుడైన చండికేశ్వరుడు పర్వతరాజు వద్దకు రాయబారం చేసే ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది. శ్రీకాళహస్తీశ్వరస్వామికి పార్వతీదేవినిచ్చి వివాహం చేయాలని పర్వతరాజును కోరగా ఆయన అంగీకరించడు. తిరిగి స్వామి వద్దకు వచ్చి ఆయన చెప్పిన మాటలను తిరిగి పర్వతరాజుకు చెప్పి ఒప్పించిన ఘట్టం అలరించింది. చివరకు స్వామి ఇచ్చిన ఏకబిల్వం (మారేడుదళం)తో పార్వతీదేవినిచ్చి వివాహం చేయడానికి పర్వతరాజు అంగీకరించడం.. ఆ తర్వాత అమ్మవారి వాహనం పెండ్లి మండపం వద్దకు చేరడం లాంటి దృశ్యాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ఓలలాడించాయి. బ్రహ్మ ఘడియల్లో ఒక్కటయ్యేందుకు నూతన వధూవరులు నిరీక్షించారు.

నేడు సభాపతి కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో సభాపతి కల్యాణం జరగనుంది. సభాపతి అంటే నటరాజ స్వామి. సోమవారం అర్ధరాత్రి తర్వాత శ్రీకాళహస్తీశ్వరస్వామికి వివాహం జరిగింది. తిరిగి మంగళవారం రాత్రి నటరాజస్వామి కల్యాణం జరగనుంది. శివస్వరూపమైన నటరాజుకు కూడా వివాహం జరగడం ఆనవాయితీగా ఉంది.

రేపు గిరి ప్రదక్షిణం

అతిథులకు స్వాగతం పలకడం, వీడ్కోలు చెప్పడం భారతీయ సంప్రదాయాల్లో ఒకటి. ఇందుకు దేవతలు కూడా అతీతం కాదని పురాణ కథల ద్వారా తెలుస్తోంది. కల్యాణ మహోత్సవానికి వచ్చిన రుషులను తిరిగి వారి స్థావరాలకు చేర్చడానికి నూతన వధూవరులైన ఆదిదంపతులు బుధవారం గిరి ప్రదక్షిణం చేయనున్నారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన వివాహ మహోత్సవానికి దేవతలతో పాటుగా కైలాసగిరుల్లో ఉంటున్న రుషులు కూడా వస్తారని ప్రతీతి.

నూతన జంటలకు తాళిబొట్లు పంపిణీ

బియ్యపు మండపం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి చేతుల మీదుగా తాళిబొట్లను పంపిణీ చేశారు. జగన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి 19 ఏళ్లుగా తాళిబొట్లను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈమేరకు తాళిబొట్లు, నూతన వస్త్రాలు, పూలమాలలు అందించి ఆశీర్వదించారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్ పాల్గొన్నారు.

శివయ్య కల్యాణానికి టీటీడీ సారె



సారె తీసుకెళుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

శ్రీకాళహస్తి: ముక్కంటీశునికి టీటీడీ తరపున సారెను సమర్పించారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఆలయ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత సోమవారం దేవాంగుల మండపం వద్దకు చేరుకోగా.. శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు వారికి ఘన స్వాగతం పలికారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి పట్టువస్త్రాలను తలమీద ఉంచుకుని వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయానికి తీసుకువచ్చారు. అనువంశిక ప్రధానార్చకులు స్వామినాథన్ సారెను అలంకార మండపంలో అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఈఓను గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. టీటీడీ ఈఓ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయన్నారు. శివయ్యకు టీటీడీ తరపున సారె సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈఓ భ్రమరాంబ కూడా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.



తాళిబొట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి

సిపాయి ఎంపికపై హర్షం



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, చిత్రంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



తిరుపతి: సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ మునిరామిరెడ్డి, బీసీ సంఘం నేతలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి.. స్వీట్లు పంచిపెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల పక్షపాతి అని కొనియాడారు. తామంతా ఆయనకు అండగా ఉంటామని ప్రతినబూనారు. మరో సారి జగన్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిపాయి సుబ్రమణ్యం ఎంపికపై హర్షాతిరేకాలు
- టపాసులు కాల్చి.. స్వీట్లు పంచిపెట్టిన నేతలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు

డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ప్రొఫైల్

పేరు : డాక్టర్. సిపాయి సుబ్రమణ్యం.
వయసు : 64 ఏళ్లు
విద్యార్హత : ఎంబీబీఎస్ (ఎస్వీ మెడికల్ కాలేజ్, తిరుపతి–1977–83)
ఎంఎస్, (ఎస్వీ మెడికల్ కాలేజ్, తిరుపతి–1984–86)
ఎం.సీహెచ్,(పుదుచ్చేరి, ఆల్ ఇండియా టాపర్ –1990–92)
తల్లిదండ్రులు : దివంగత పార్వతమ్మ, దివంగత సిపాయి గోవిందరెడ్డి.
భార్య : దివంగత శాంతి
కుమారుడు : డాక్టర్ సిపాయి కీర్తిసాగర్‌రెడ్డి
కులం : వన్నియకులక్షత్రియ (బీసీ).
జన్మస్థలం : మోపిరెడ్డిపల్లి గ్రామం, పెనుమూరు మండలం, చిత్తూరు జిల్లా.
రాజకీయ ప్రయాణం : ప్రజారాజ్యం పార్టీ తరపున శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి.
- 2020–23 వరకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ.
- వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.

ప్రొఫెషనల్ అచీవ్‌మెంట్స్ : రాయలసీమలో మొట్టమొదటగా ల్యాప్రోస్కోపిక్ ఆసుపత్రిని 1998లో స్థాపించారు.
- ఎస్వీ మెడికల్ కళాశాల మాజీ ప్రొఫెసర్‌గా, యూరాలజీ విభాగం హెచ్‌వోడీగా పనిచేశారు.
- ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో ఈసీ మెంబర్‌గా, ఎస్వీ యూనివర్సిటీ ఈసీ మెంబర్‌గా, మెడికల్ కౌన్సిల్‌లో మెడికల్ ఎథిక్స్ కమిటీ మెంబర్‌గా, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఎక్కువ మందికి సర్జరీలు చేసినందుకుగాను రష్ ఆసుపత్రికి ఏపీ ప్రభుత్వం అవార్డు అందజేసింది.

తిరుపతి కల్చరల్/శ్రీకాళహస్తి/రేణిగుంట/ఏర్పేడు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఎంపికపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిపాయి సుబ్రమణ్యం వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఈ నేపథ్యంలో సిపాయి సుబ్రమణ్యం ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికయ్యారు. విషయం తెలుసుకున్న వన్నెకుల క్షత్రియ సంఘం నేతలు, కార్యకర్తలు, సిపాయి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభిమానులు సంబరాల్లో మునిగి తేలారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

తిరుపతిలో..

తిరుమల బైపాస్ రోడ్డులోని కొర్లగుంట వద్ద కార్పొరేటర్ మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో బీసీలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీసీ నాయకులు వేలాయుధం, సుబ్రమణ్యంరెడ్డి, ఆర్.సురేష్‌బాబు, పాండురంగారెడ్డి,గోపి, శరవణ, ఉమాపతి, అన్నాదొరై, భూషణం, ఈశ్వర్, బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి పట్టణంలో వన్నెకుల క్షత్రియులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్‌సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. వన్నెకుల క్షత్రియ సంఘం గౌరవాధ్యక్షుడు బుజ్జిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణారెడ్డి, మురళీకృష్ణారెడ్డి, కంఠా ఉదయ్, మధురెడ్డి,మునికృష్ణారెడ్డి, జీవీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి, సదాశివరెడ్డి తదితరులు బాణా సంచాకాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

ఏర్పేడులో..

స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, బీసీ సంఘాల నాయకులు కూనాటి రమణయ్య యాదవ్, దామోదరంరెడ్డి, మునిరెడ్డి, వరదయ్య, రాజ్యలక్ష్మి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



శ్రీకాళహస్తిలో సంబరాలు చేసుకుంటున్న బీసీ సంఘం నాయకులు

ఆ రెండు పేజీలు చించేశారు

- తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు తారుమారు
- 1972 నాటి రికార్డులోని 21, 22 పేజీలు చించివేత
- వాటి స్థానంలో వేరొక పేజీలు అంటించిన అక్రమార్కులు
- ట్యాంపరింగ్ వెనుక టీడీపీ నేత 'నాయుడు' హస్తం



డాక్యుమెంట్‌లో ఓ పేపర్‌ను చించేసి అతికించిన దృశ్యం

సాక్షి, తిరుపతి: తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని డాక్యుమెంట్‌లోని రెండు పేజీలను చించివేత నిజమేనని అధికారులు తేల్చారు. అందుకు సంబంధించిన రిపోర్ట్‌ని ఉన్నతాధికారులకు పంపారు. చించివేతకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. దీనివెనుక టీడీపీ నేత 'నాయుడు' హస్తం ఉన్నట్టు అనుమానిస్తున్నారు.

అసలేం జరిగిందంటే?

దామినేడు పరిధిలోని భూమి విషయమై కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. కొనుగోలు చేసింది ఒకరైతే రికార్డులు తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుంది మరొకరు. విషయం వెలుగులోకి వస్తే ఆక్రమించుకున్న భూమి దక్కకుండా పోతుందని భావించిన టీడీపీ నాయకుడు ఒకరు తిరుపతి రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న డాక్యుమెంట్‌లోని ఓ పేపర్‌ని చించివేశాడు. దాని స్థానంలో వేరొక పేపర్‌ని అంటించాడు. ఈ విషయం ఇటీవల సాక్షి దినపత్రికలో 'ఆరెండు పేజీలు.. ఏమయ్యాయి?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై 'సీఎంఓ' స్పందించింది. వెంటనే నిజాలు నిగ్గుతేల్చాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. రంగంలోకి దిగిన అధికారులు అందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు.

ఆ పేజీలో మరిన్ని సర్వే నంబర్లు

చించివేతకు గురైన ఆ రెండు పేజీల్లో ఒక సర్వే నంబరే కాకుండా... మరిన్ని సర్వే నంబర్లు ఉన్నాయి. 1972 నాటి రికార్డులోని 21, 22 పేజీలను చించివేశారని, పాత పేపర్‌లో ఏవీ ప్రసన్నకుమార్ నుంచి సూర్యనారాయణ చౌదరి భూమి కొనుగోలు చేస్తే... అతని నుంచి తాతినేని జయప్రద కొనుగోలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఆమె నుంచి తాము కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. తిరిగి అంటించిన పేపర్‌లో ఓ ముస్లిం మహిళ నుంచి టీడీపీకి చెందిన 'నాయుడు' అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లు ఉంది. మరో పేజీలో సబ్ డివిజన్ చేసిన సర్వే నంబర్ /3లో మరో 1.5 ఎకరాలకు పైగా ఉంది. ఆ రెండు పేజీల్లో మొత్తం కోట్ల రూపాయలు విలువచేసే 3 ఎకరాలకు పైగా ఉన్న భూమిని కొట్టేయడానికి పేపర్‌ని చించివేసినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వారిపై వేటు తప్పదా?

రెండు పేజీల చించివేత వెనుక ఉన్న సూత్రధారులైన అధికారులపై క్రిమినల్ కేసులతో పాటు వేటు తప్పదని అధికారులు చెబుతున్నారు.

సీనియర్ సిటిజన్ యాక్ట్ పకడ్బందీగా అమలు

తిరుపతి అర్బన్: సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007ని పకడ్బందీగా అమలు చేయాలని దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ ఏడీ శ్రీనివాస్‌ను కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో హరేకృష్ణ ఉపాధ్యాయ అనే వ్యక్తి తనకు జీవన భృతి కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు బిక్రం ఉపాధ్యాయ అనే వ్యక్తి నెలకు రూ.3,200 అందించాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా నాయుడుపేట మండలం, పుదూరు గ్రామానికి చెందిన జయరామయ్య తన ఆస్తిని కుమార్తె, మనవళ్లు తీసుకుని సరిగా చూడడం లేదని ఇచ్చిన పిటిషన్ మేరకు సివిల్ కేసుగా భావించి తగు న్యాయం చేయాలని గూడూరు ఆర్డీఓను ఆదేశించారు.

హౌసింగ్ కార్యాలయంలో సీపీయూ చోరీ


చోరీ అయిన సీపీయూ

సత్యవేడు: ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని హౌసింగ్ కార్యాలయంలో కంప్యూటర్‌కు వినియోగించే సీపీయూను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఏఈ వెంకటసుబ్బయ్య సీపీయూ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పురుషోత్తమరెడ్డికి ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉన్న మరో సీపీయూను కూడా ఎత్తుకెళ్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపటి నుంచి మహాకుంభాభిషేక మహోత్సవం


ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి 24 దాకా నూతన సువర్ణ విమాన గోపుర శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతి దంపతులు అమ్మవారి విమానగోపురానికి తిరుమల శ్రీవారి ఆనంద నిలయం తరహాలో బంగారు తాపడం పనులు చేయిస్తున్నారని, ప్రస్తుతం ఈ పనులను పూర్తి కావడంతో 22 నుంచి కుంభాభిషేకాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆదేవిధంగా వల్లటూరు సుబ్బమ్మ జ్ఞాపకార్థ ఆమె కుమారుడు, కోడలు వల్లటూరు మధుసూదన్‌నాయుడు-శాంతి దంపతులు ఆలయ ఆవరణలో ఆస్థాన మండపాన్ని నిర్మించారని, ఈ సందర్భంగా ఈ మండపాన్ని కూడా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. 22 నుంచి 24 వరకు త్రయాహ్నిక దీక్షతో అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. 22, 23 తేదీల్లో రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు లక్ష కుంకుమార్చన ఉంటుందని తెలిపారు. 24న 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు కుంకుమార్చన జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు కళత్తూరు జనార్దన్ రెడ్డి, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.


విమానగోపురానికి తిరుమల ఆనందనిలయం తరహాలో చేపడుతున్న బంగారు తాపడం పనులు పరిశీలిస్తున్న దృశ్యం

ఈ పంట నమోదు తప్పనిసరి


పంట నమోదును పరిశీలిస్తున్న పద్మావతి

భాకరాపేట : ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకునేలా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ కమిషనర్ పద్మావతి తెలిపారు. ఆమె సోమవారం చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, దీన్‌దార్లపల్లె పంచాయతీల్లో పంట నమోదును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఏ రైతూ పంటను సాగు చేసి నష్ట పోకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తద్వారా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించి పంట దెబ్బతింటే పరిహారం అందజేస్తుందన్నారు. పంట నమోదు చేయడంలో రైతు భరోసా కేంద్రాల పాత్ర కీలకమన్నారు. అలాగే రైతులు పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి ధనలక్ష్మీ, వీఆర్‌వో నిర్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కలకలం


నిందితుడు సతీష్

తడ: ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లోని రామాపురం గ్రామంలో నాలుగేళ్ల బాలుడిని తమిళనాడుకు చెందిన ఓ యువకుడు సోమవారం కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించడంతో తీవ్ర కలకలం నెలకొంది. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని గుమ్మిడిపూండి గ్రామం శ్రీలంక కాలనీకి చెందిన సతీష్ మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై రామాపురం ఎస్సీ కాలనీకి వచ్చాడు. వీధిలో ఆడుకుంటున్న రునాల్డో(4) అనే బాలుడిని తన బైక్‌పై ఎక్కించుకుని తమిళనాడు వైపు బయలుదేరాడు. బాబు తల్లి తేన కుమారుడు కనిపించకపోడవంతో స్థానికులను విచారించారు. ఓ యువకుడు బైక్‌పై తీసుకు వెళ్లినట్టు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు తలో దిక్కు వెతకడం మొదలుపెట్టారు. జాతీయ రహదారిపై తమిళనాడు వైపు బాలుడిని తీసుకెళుతున్న బైక్‌ని పన్నంగాడు వద్ద ఆపి బాలుడిని తల్లికి అప్పగించారు. కిడ్నాప్‌నకు ప్రయత్నించిన యువకుడిని గ్రామంలోకి తీసుకు వచ్చి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఫిర్యాదు అందుకున్న ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కిడ్నాప్ చేసిన యువకుడితోపాటు మరో ఇద్దరు కూడా ఉన్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు.

మహిళ ఆత్మహత్యపై కేసు


మృతి చెందిన వెంకటమ్మ

సైదాపురం: మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని జోగిపల్లికి చెందిన యాకసిరి వెంకటమ్మ(38)అనే వివాహిత గుండెనొప్పి భరించలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరుకు తరలించారు.

సారా స్వాధీనం



నారాయణవనం: సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పుత్తూరు సెబ్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని కీళగరం చెరువుకట్టపై సోదాలు నిర్వహించగా.. సుబ్రమణ్యం(37) అనే వ్యక్తి వద్ద 7 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు శింగిరికోనలోని రాళ్ల కాలువ వద్ద సారా కాస్తున్న వెంకటకృష్ణపాళ్యంకు చెందిన ఈశ్వరయ్య(42)ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్ : బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంటలో సోమవారం సారా విక్రయిస్తున్న శరత్‌బాబు(36) అనే వ్యక్తిని ఎస్‌ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. దాడిలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, నాగరాజా, వెంకటేష్ పాల్గొన్నారు.

జీరో స్థాయికి మాతాశిశు మరణాలు

- క్రలెక్టరేట్‌లో ప్రసూతి మరణాల నిఘా, ప్రతిస్పందన కమిటీ సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: మాతాశిశు మరణాలు జిల్లాలో జీరో స్థాయికి చేరాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖలకు చెందిన అధికారులు సరైన వైద్యం అందించడంతోపాటు పోషకాహారం ఇవ్వడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రసూతి మరణాల నిఘా, ప్రతిస్పందన కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. మాతాశిశు మరణాలకు సంబంధించి వాకాడు మండలం, బాలిరెడ్డి పల్లి అఖిల, దక్కిలి మండలం, వెంకటరమణమ్మ మరణాలపై చికిత్స అందించిన డాక్టర్లతో, కుటుంబ సభ్యులతో వైద్య చికిత్సలపై ఆరా తీశారు. హైరిస్క్ గర్భవతులకు స్థానికంగా చికిత్స అందించకపోవడం, ప్రసవానికి వారం ముందే ప్రధాన ఆస్పత్రుల్లో చేర్పించకపోవడం లాంటివాటిపై విచారణ చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరిని ఆదేశించారు. కమిటీ కన్వీనర్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, డీఐఓ శాంతకుమారి, చిన్న పిల్ల ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ, ఎండీఆర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ ప్రసన్నా టాగూర్, సీడీపీవో పద్మజ, 108 సర్వీసెస్ పవన్ కుమార్ హాజరయ్యారు.

ఎంఆర్‌పల్లెలో గుట్టుగా వ్యభిచారం !

- మహిళా ఎస్‌ఐ కుటుంబ సభ్యులే నిర్వాహకులు
- ఎస్‌ఐ తల్లి, తమ్ముడు, మరో ముగ్గురి అరెస్టు

తిరుపతి రూరల్: తిరుపతి ముత్యాలరెడ్డి పల్లె పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళా ఎస్‌ఐ కుటుంబసభ్యులే గుట్టుగా వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. ఏపీలోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి మహిళలను రప్పించి జోరుగా ఈ దందాను నడుపుతున్నారు. ఆ ఎస్‌ఐ ఏ స్టేషన్‌లో పనిచేస్తే ఆ స్టేషన్ పరిధిలోనే వీరు దుకాణం తెరుస్తారు. ట్రాన్స్‌ఫర్ అయితే అక్కడకు మకాం మారుస్తారు. అందులో భాగంగా ఆ మహిళా ఎస్‌ఐ తిరుచానూరులో పనిచేస్తున్నప్పుడు ఆ స్టేషన్ పరిధిలోని లింగేశ్వరనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఆమె ముత్యాలరెడ్డిపల్లెకు వచ్చిన తర్వాత ఆ స్టేషన్ పరిధిలోకి వచ్చి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో నిఘా పెట్టిన ఎంఆర్ పల్లె పోలీసులు సీఐ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ధనలక్ష్మి నగర్‌లో దాడులుచేశారు. మహిళా ఎస్‌ఐ తమ్ముడు ప్రశాంత్, తల్లి, తిరుపతి అవిలాల, హైదరాబాదుకు చెందిన ఇద్దరు మహిళలు, తిరుచానూరుకు చెందిన ఓ విటుడిని పోలీసులు అరెస్ట్‌చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా తల్లి, తమ్ముడు వ్యవహారశైలి నచ్చక, వారితో గొడవ పడి మహిళా ఎస్‌ఐ ఏడాది నుంచి వారికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఎస్‌ఐ మెడికల్ లీవ్‌లో వెళ్లిన తర్వాత మూడు నెలలుగా ధనలక్ష్మినగర్‌లో అద్దె ఇంటిని తీసుకుని ఆమె తల్లి, తమ్ముడు వ్యభిచార గృహం నడుపుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పటిక రాతి కట్టడానికి ఎమ్మెల్యే భూమన పూజలు


పూజ చేస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ గర్భాలయ నిర్మాణంలో నాలుగో వరుస పటిక రాతి కట్టడం పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఇప్పటికే గర్భాలయం చిత్రవనం, పద్మజఘతి, కుముదకం పేర్లతో కూడిన రాతి కట్టడం పనులు పూర్తి చేశారు. తాజాగా నాలుగో వరుస పటిక రాతి కట్టడం పనులు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను త్వరిగతిన సాగించాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, వైఎస్సార్ సీపీ నేత దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

మేయర్ హత్య కేసు విచారణ

చిత్తూరు అర్బన్: మేయర్ అనురాధ, ఆమె భర్త మోహన్ హత్య కేసు విచారణ సోమవారం చిత్తూరులోని మహిళా కోర్టులో కొనసాగింది. రెండో సాక్షి కిషోర్‌ను న్యాయస్థానం విచారించింది. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ వాదనలు వినిపించారు. సాక్షుల వాంగ్మూలాన్ని న్యాయమూర్తి శాంతి నమోదు చేసుకున్నారు.


రావణబ్రహ్మ వాహనంపై పళ్లి కొండేశ్వరుని కటాక్షం


రావణబ్రహ్మ వాహనంపై శ్రీ వాల్మీకేశ్వర స్వామి


ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

- ఉదయం త్రిసూల స్నానం
- ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లిలోని సర్వమంగళాదేవి సమేత పళ్ళికొండేశ్వ స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం రాత్రి శ్రీ పళ్ళికొండేశ్వర స్వామి రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహన సేవలో అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉదయం 10 గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా త్రిసూల స్నానం కన్నులపండుగగా నిర్వహించారు. చివరగా ధ్వజావరోహణంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలను ముగించారు. బ్రహ్మోత్సవాలు నిర్వహించిన 10 రోజుల పాటు ఆలయంలో సేవలందించిన ప్రభుత్వ, ప్రవేటు అధికారులు, సిబ్బందికి ఆలయ చైర్మన్ ఏవీయం బాలాజీ రెడ్డి ఆలయం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉభయదారులుగా శ్రీసిటీ ఎండీ రవిసన్నా రెడ్డి వ్యవహరించారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ట్రస్టు బోర్డు చైర్మన్ ఏవీయం బాలాజీ రెడ్డి, సభ్యులు, ఈఓ రామచంద్రారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు రాధాకృష్ణా రెడ్డి, సభ్యులు ఆనందుడు, సురేష్, మంజుల, మునివేలు, చిత్ర, కవిత, సత్య, అజయ్ కుమార్, సిబ్బంది శరవణ, దండపాణి, పరంధామన్ పర్యవేక్షించారు.



అమ్మ ఒడిలో అక్షరం

ప్రతి ఒక్కరు మాతృభాషను ప్రేమించాలని సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని సనత్‌కుమార్ అమ్మ ఒడిలో అక్షరం అనేలా మండల తీర ప్రాంతంలోని సముద్రం వద్ద సోమవారం సైకత శిల్పాన్ని రూపొందించారు.

\- చిల్లకూరు